క్లుప్తంగా

లక్ష్మీ తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు



దాచేపల్లి : లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం చేపట్టారు. గురుస్వాములు హనుమంతరావు, మస్తాన్‌రావు, కొర్రపాటి ఏర్రయ్య, రామారావుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. జ్యోతిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.

ఏసు మార్గంలో నడవాలి



విజయపురిసౌత్: ప్రతి క్రైస్తవుడు తోటివారితో ప్రేమతో మెలగాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ అన్నారు. ఆదివారం స్థానిక సాగర్ మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతి క్రైస్తవుడు ఏసుక్రీస్తు మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. దీనికి ముందు భక్తులు దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తలనీలాలు, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

మూడు రోజుల ప్రజాభిప్రాయ సేకరణ



మాచర్ల: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ విద్యుత్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మూడు రోజుల పాటు జరుగుతుందని, మాచర్ల, దుర్గి సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు ఆదివారం తెలిపారు. సోమ, మంగళ, బుధవారాలు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఆయా విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేయటం జరిగిందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 1గంట వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి: మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని సత్తెనపల్లి ఆ.వో.పా పట్టణ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు ఆదివారం కోరారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ప్రధాన కూడలి సమీపంలోని ఎం.ఎం.రోడ్డులో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కొందరు ముష్కరులు పేడను పులిమి అగౌరవ పరచటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను తెచ్చిన మహానుభావుని విగ్రహానికే రక్షణ కరువైందన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు.

నేటి నుంచి జగనన్న ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఈవోపీఆర్డీ పి.శివరామయ్య ఆదివారం తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయంలో సెక్రటరీ, వీఆర్వో ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయానికి హాజరుకావాలని తెలిపారు. ఫిబ్రవరి నెల 9వ తేదీతో ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లన్నీ జిల్లా కలెక్టర్ అథారిటీతో కన్వేయన్స్ డీడ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

వరికపూడిసెలకు సత్వరమే నిధులు విడుదల చేయాలి

నకరికల్లు: పల్నాడుకు వరప్రదాయినిగా భావిస్తున్న వరికపూడిసెల ప్రాజెక్టుకు సత్వరమే నిధులు విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటానాయక్ ఆదివారం డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గత నెలలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

మోసపూరిత హామీలను నమ్మకండి

- అవకాశవాది చంద్రబాబు అండ్ టీం
- పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీఆర్కే



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కల్లబొల్లి హామీలను ప్రకటించి ప్రజలను మోసగించటానికి చంద్రబాబు నాయుడు అండ్ టీం సిద్ధంగా ఉన్నారని, వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ముటుకూరులో లూథరన్ దేవాలయం మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాక సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నాయకులు, గ్రామస్తులు, మహిళలు బాణసంచా కాలుస్తూ పూల వర్షం కురిపించారు. చర్చిలో ప్రార్థన నిర్వహించిన అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభను సందర్శించి వేదికపై నుంచి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో అలజడులను సృష్టించి లబ్ధి పొందాలని ప్రయత్నించే చంద్రబాబు అండ్ టీం ఆటలు సాగవన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రజల కష్టనష్టాలకు అండగా నిలుస్తూ కోట్లాది రూపాయలను నేరుగా వారి ఖాతాలో జమ చేసిన వైఎస్సార్‌సీపీని దీవించాలన్నారు. తెదేపా నాయకులు ఎన్నికల తరువాత కనిపించరన్నారు. టీడీపీ లాంటి వారి మోసపూరిత మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు.



హాజరైన భారీ జన సందోహం

ముటుకూరులో..

ముటుకూరు ఎస్సీ కాలనీలో రూ.60 లక్షలతో చర్చి నిర్మాణానికి సీఎం జగన్ ఆదేశాలతో నిర్మించామని, అదేవిధంగా రూ.50 లక్షల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. లూథరన్ చర్చి ఎదురుగా 10 సెంట్లు స్థలాన్ని కేటాయించి, రిజిస్ట్రేషన్ పత్రాలను కమిటీ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో సుమారు రూ.15 కోట్లతో వివిధ గ్రామాలలో చర్చిల అభివృద్ధికి పాటుపడిన విధానాన్ని వివరించారు. ఎస్సీ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, సర్పంచి గొంది నాసరయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, ఎంపీటీసీ పసుపులేటి వెంకటరామయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొల్లి హనుమయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కట్టబోయిన రవి, పులిమెల ప్రసాద్, భాస్కర్, మాచర్ల మైఖేల్, జిల్లెల మూడి శేషయ్య, పుట్ట మారుతి ప్రసాద్, జాస్తి రామ్మూర్తి, పులిమెల మాణిక్యం, రామిశెట్టి బాబురావు, సొసైటీ మాజీ చైర్మన్ కేశంశెట్టి అంజయ్య, పలువురు నాయకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సత్కారం



ఉత్తమ అధికారిగా అవార్డు అందుకుంటున్న ఈఈ హరిబాబు



ఉత్తమ అధికారిగా అవార్డు అందుకుంటున్న డీఈ రామయ్య

మాచర్ల: మాచర్ల విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు చూపి బిల్లింగ్ మీటర్స్ మార్పు, వ్యవసాయ సర్వీసులను పూర్తి స్థాయిలో ఉత్తమంగా నిర్వహించిన సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, డీఈ ఎ.రామయ్యలకు ఉత్తమ అవార్డులందించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్తమ అధికారులు ఈఈ హరిబాబు, డీఈ రామయ్య, ఏఈ హైమావతిలకు అవార్డులందించారు. వీరిని పలువురు అభినందించారు.

మిర్చిని మింగేస్తున్న తామర పురుగు



తామర పురుగు నుంచి రక్షణ పొందుతున్న మిర్చి పంట

కారెంపూడి: పల్నాడులో మిర్చి రైతులు సంక్రాంతి పండుగ తర్వాత నుంచి వచ్చిన వాతావరణ మార్పుల వల్ల మిర్చిలో తామర పురుగు సమస్యతో సతమతం అవుతున్నారు. వాస్తవంగా పండుగ తర్వాత గతంలో తామర పురుగు ఉధృతి తక్కువగా ఉండేది. తుఫాన్ ప్రభావం వల్ల కానీ, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కానీ తామర పురుగు ఉధృతి ఎక్కువగా కన్పిస్తోంది. ఏ నోట విన్నా ఇదే సమస్య. చివరకు అది కంది పంటను సైతం ఆశించి పూత రాలుస్తూ నష్ట పరుస్తోంది. కారెంపూడి మండలంలో 2,081 ఎకరాలలో మిర్చి సాగవుతోంది. చాలా చోట్ల తొలి విడత కాయ కోతలు అయ్యాయి. తొలి కోతలోనే ఎకరాకు 5 క్వింటాళ్లపైనే దిగుబడి వచ్చింది. రైతులు సంతోషంతో ఉన్న సమయంలో పంటకు తామర పురుగు సోకడంతో వారి ఆశలు నీరుగారుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఎన్నో ఆశలతో పంటను సాగు చేస్తున్న రైతులు నిత్యం తామర పురుగు నివారణ గురించే ఆలోచిస్తూ దాని నివారణకు ఏవో ఒక మందులను పిచికారీ చేస్తున్నారు. చివరకు పంటపై లిక్కర్ కూడా స్ప్రే చేస్తున్నారు. వాస్తవంగా దీని నివారణకు మందులు లేవని కానీ కొన్ని మందులు వాడితే మాత్రం ఉధృతి తగ్గి ఫలితం ఉంటుందని గురజాల, నరసరావుపేట హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. ఎకరాకు 20 నుంచి 30 జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని, ప్యూపా దశలో ఉన్న పురుగు ఆకు అడుగు భాగంలో కానీ చెట్టు మొదలులో కానీ గుడ్లు పెడుతుందని, దీనికి వేప పిండిని భూమిలో వేయడం లేదా వేప నూనె పైరుపై పిచికారీ చేయడం కానీ చేయాలని సూచిస్తున్నారు. గ్రాసియా, ఎలక్ట్రో, గ్రోప్రియా మందులు మార్చి మార్చి పిచికారీ ఫలితం ఉంటుందని హార్టికల్చర్ అధికారులు సూచిస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



మోడల్ పేపర్ పుస్తకాలతో విద్యార్థులు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్ అచ్చు పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) వారు ముద్రించిన ఈ పుస్తకాలను నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దాత జాన్‌సైదా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకొని పరీక్షలలో మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్, పీఎం చైర్మన్ షేక్ మీరావలి, ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, షేక్ మాబుసుభాని, యూటీఎఫ్ నాయకులు కె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కు ఈవో సుధాకర్‌రెడ్డికి అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన దాసరి వెంకట నాగప్రసాద్, రాజేశ్వరమ్మ దంపతులు రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళ చెక్కును ఆలయ ఈవో టి. సుధాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల చైర్మన్ కొత్త సాంబశివరావు (వీఎస్‌పీ), కమిటీ సభ్యులు కాకుమాను వెంకట బదరీ నారాయణ, ఆలపాటి ప్రసాదరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర, సభ్యులు ఏలూరి అశోక్‌బాబు, కూరపాటి వెంకట అమర్, తుళ్లూరి మోహన్‌బాబు, నంద్యాల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార ఆదివారం తెలిపారు. నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో 11 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న ఎం. వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మాదలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం నేడు

ప్రారంభించనున్న మంత్రి అంబటి రాంబాబు



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రూ.40 లక్షల ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాన్ని ఈ నెల 29వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. వీటితో పాటు రైతులు పంటలను నిల్వ చేసేందుకు గాను రూ.43.90 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్(ఎంపీఎఫ్‌సీ) గోదామును ప్రారంభించనున్నారు. ఆ మేర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ఓర్వకల్లు తిరునాళ్ల లైసెన్సు హక్కుల వేలం

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరంటాళ్లమ్మ వారి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా సోమవారం లైసెన్సు హక్కుల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం దేవస్థానం ఈవో జి.రామకోటిరెడ్డి తెలిపారు. క్రోసూరులోని వీరభద్రమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. లైసెన్సు హక్కులు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 25 వరకు అదేవిధంగా మార్చి 24 నుంచి 26 వరకు ఉంటాయన్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరించు హక్కు, లడ్డూప్రసాదములు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులకు పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు చొప్పున ధరావత్తు చెల్లించాలన్నారు. పాటలలో హెచ్చు ధరకు పాడుకున్న వారికి మినహా ధరావత్తు సొమ్ము మిగతావారికి వాపసు చేయబడుతుందన్నారు.

జూదరుల అరెస్టు

నాదెండ్ల: చందవరం గ్రామంలోని ముస్లిం ఖబరస్తాన్ సమీపంలో పేకాట శిబిరంపై నాదెండ్ల పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న అద్దంకి ప్రభాకర్, దర్నాసి కోటేశ్వరరావు, మొగిలి నాగార్జున, తోకల సుబ్బారావులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4050లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు.

వేగవంతంగా డబుల్ రోడ్డు పనులు



క్రోసూరు: రూ.149 కోట్ల నాబార్డు నిధులతో జరుగుతున్న అమరావతి-బెల్లంకొండ డబుల్‌రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, సైడు డ్రైన్లు, మార్గమధ్యంలో కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్ నుంచి అమరావతి వైపు బీటీ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. అదేవిధంగా క్రోసూరు నుంచి బెల్లంకొండ వైపు రోడ్డు పనులు జరుగుతున్నాయి. దొడ్లేరులో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. అప్పటి నుంచి పనులు చకచకా సాగుతున్నాయి. ప్రజల చిరకాల కోరికైన ఈ రోడ్డు పూర్తయితే గ్రామాల్లో రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఇసుక రవాణా, ప్రజల ప్రయాణాలకు సులభతరమవుతుంది. వీటితో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మీ సంక్షేమం, అభివృద్ధి.. మా లక్ష్యం



దాచేపల్లిలో డ్వాక్రా మహిళలకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

- మంచి చేశాం.. ఆశీర్వదించండి
- డ్వాక్రా అక్క చెల్లెమ్మలు ఆలోచించి ఓటు వేయండి
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

దాచేపల్లి : మీ అందరి సంక్షేమం కోసం పని చేస్తున్న మమ్మల్ని మరోసారి ఆశీర్వదించాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు పాల్గొని డ్వాక్రా మహిళలకు చెక్‌లు అందజేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా చేయలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10.78 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేశారని ఎమ్మెల్యే చెప్పారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు తదితర పథకాలు మహిళల అభివృద్ధి కోసం అమలు చేస్తున్నారని, మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఆయన తెలిపారు. మీకు కష్టం కాకూడదనే సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చామని, నేరుగా మీ ఇంటికే పింఛన్లు, పథకాలు వస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థలను తీసేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, మీకు సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు కావాలా వద్దా అని మహిళలను అడిగితే కావాలని వారు బదులిచ్చారు. మీకు మేలు చేసి మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని, మీకు అండగా ఉంటామని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని.. మన ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని, మీకు మంచి జరిగిందని భావిస్తేనే తమను గెలిపించాలని ఆయన కోరారు. మునుపెన్నడూలేని సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపించామని, అక్క చెల్లెమ్మలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. నగర పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని, రూ.16.50 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మండపాటి రమేష్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, కౌన్సిలర్లు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న మణికంఠ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మల్లేష్

మాచర్ల రూరల్: గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెంది, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని భైరవునిపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగార్జున సాగర్ నుంచి ద్విచక్ర వాహనంపై మల్లేష్ (30), కలివెల మణికంఠలు మాచర్ల వస్తుండగా భైరవునిపాడు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠ కాలికి తీవ్ర గాయాలు కాగా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. ఈ మేరకు విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ మత రాజకీయాలపై పోరాడదాం



సమావేశంలో మాట్లాడుతున్న గంజిమాల రవిబాబు, తదితరులు

అమరావతి: మతరాజకీయాలు చేసి మూడోసారి అధికారంలోకి రావాలన్న బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టటానికి లౌకికవాదులందరూ పోరాడాల్సిన అవసరముందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంజిమాల రవిబాబు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగంలో లౌకికతత్వాన్ని, రాజ్యాంగ విలువలను నరేంద్ర మోదీ నాశనం చేస్తున్నాడన్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంటే నిరుద్యోగ సమస్యను, వ్యవసాయ రంగం దివాలా తీసి రైతులు ఆత్మహత్య చేసుకుంటే బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. మరోపక్క నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం చేసిన బీజేపీతో రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడటం దారుణమన్నారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ అధికారంలోకి రావాలనే రాజకీయ దురుద్దేశంతో టీడీపీ, జనసేన బీజేపీతో చేతులు కలపటం రాజకీయ కపట నాటకానికి నిదర్శమన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు దేశ వ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తుల్ని కలుపుకొని సీపీఎం పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఏపీలో కూడా బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపుకొని రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీపీఎం పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు సయ్యద్ మోహిదీన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం వెంకటేశ్వరరాజు, నాగులమీరా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న రవికులోత్తమరావు



త్యాగరాజ ఆరాధన ఉత్సవాలకు హాజరైన సంగీత ప్రియులు

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగాయి. హైదరాబాదు ప్రసిద్ధ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ రవికులోత్తమరావు, ఆర్ సుధాలక్ష్మి, మల్లెల దక్షిణామూర్తి, ఎన్.షణ్ముఖ, వి.వెంకటేష్‌ల బృందం సంగీత సాహిత్యాలను సమపాళ్ళలో మేళవించి, స్వరరాగ సుధా రస ధారలతో సకల జగత్తును రసానంద డోలికలలో ఓలలాడించారు. పంచరత్నాలతో పాటు పలు త్యాగయ్య కీర్తనలను ఆలపించి సంగీత ప్రియులకు శ్రవణానందం కలిగించారు. స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీవిశ్వనాథం నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.